

మందగించిన కొనుకోళ్లు


మాంసాహార ప్రియులు చికెన్ ముఖం చూడడం లేదు.. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోళ్లు కనిపించడం లేదు.. ఫలితంగా చికెన్ ధర పాతాళానికి పడిపోయింది. - 8లో



గంజాయితో వ్యక్తి అరెస్ట్

తుని రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేసి వ్యక్తిని అరెస్టు చేశారు. - 8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 2,29,891 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.30 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 12,500 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

పరిశ్రమల్లో నిర్లక్ష్యం ఉపేక్షించం

తుని రూరల్: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినందున పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరని శాసన మండలిలో టీడీపీ పక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు తన క్యాంపు కార్యాలయంలో దివీస్, అరబిందో పరిశ్రమల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. యాజమాన్యాలు పరిశ్రమలు స్థాపించడంతో పాటు ప్రజలకు, ఉద్యోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రియాక్టర్లు, బాయిలర్ల పేలుళ్ల వంటి ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సముద్ర జలాలలో పరిశ్రమల వ్యర్థాలు విడుదలతో పర్యావరణానికి, మత్స్య సంపదకు విఘాతం కలుగుతోందన్నారు. దీంతో మత్స్యకారులు ఒడిశా వలసపోతున్నారన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చాలన్నారు. భూములు ఇచ్చిన అర్హులైన రైతులకు సంతృప్తికరమైన నష్టపరిహారం చెల్లించాలన్నారు. గతంలో రూ.250 కోట్లతో సేకరించిన భూముల విలువ ఇప్పుడు రూ.3,500 కోట్లకు పెరిగిందన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట
- సామగ్రి సమకూర్చిన దేవస్థానం



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మి సామూహిక వ్రతాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. వ్రత సామగ్రిని ఆలయ అధికారులు సమకూర్చారు. ఈఓ బళ్ల నీలకంఠం, భక్త సంఘం నాయకులు త్రిమూర్తులు వ్రతాలను ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ మొదటి అంతస్తు చుట్టూ సామూహిక వ్రతాల్లో సుమారు 560 మంది వ్రతాలు ఆచరించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ఈస్టర్న్ నేవల్ కమాండ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్



పెందార్కర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అన్నవరం: ఈస్టర్న్ నేవల్ కమాండ్ (విశాఖపట్నం) ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్, ఆయన సతీమణి, నేవీ వైఫ్స్ అసోసియేషన్ (ఈస్టర్న్ నేవల్) అధ్యక్షురాలు సంధ్యా రావు శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందచేసి సత్యదేవుని ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట పలువురు నేవీ అధికారులున్నారు.

సుబ్బాలమ్మకు గాజుల అలంకరణ



గాజుల అలంకరణలో అమలాపురం సుబ్బాలమ్మ వారు

అమలాపురం టౌన్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో అమ్మవారిని 80 వేల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు సమకూర్చిన గాజులతో అమ్మవారినే కాకుండా అంతరాలయాన్ని మొత్తం అలంకరించారు. రంగుల రంగుల గాజులను అమ్మ సన్నిధిలో గోడ అనేది కనిపించకుండా తీర్చిదిద్దారు. వేలాది మంది మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు కుంకుమ పూజలు చేశారు.



భద్రతా ప్రొటోకాల్‌ను బలోపేతం చేయాలి

ఇటీవల కోల్‌కతా ఆసుపత్రిలో జరిగిన ఘటన మనసును కలచివేసింది. ఇలాంటి ఘటన జరిగిన నేపథ్యంలోనైనా ఆసుపత్రి, పరిసరాల్లో వైద్యులు, సిబ్బంది, రోగుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రుల యాజమాన్యాలు తమ భద్రతా ప్రొటోకాల్‌లను మరింత బలోపేతం చేయడం అత్యవసరం. కచ్చితంగా భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టాలి. నిఘా చర్యలను మెరుగుపరచాలి. రోగి హక్కులు, లింగ పరమైన అంశాల్లోని సున్నితత్వంపై అవగాహన కలిగించాలి. బలమైన రిపోర్టింగ్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. ఏదైనా దుష్ప్రవర్తనను గుర్తిస్తే వెంటనే వేగవంతమైన చర్య తీసుకోవాలి.

– డాక్టర్ లక్ష్మి, ఆప్తాల్మాలజిస్ట్, ట్రస్టు హాస్పిటల్, కాకినాడ.





రోగుల రద్దీ వార్డుల్లో భద్రత పెంచాలి

హాస్పిటల్‌లోని క్యాజువాలిటీ గైనిక్ విభాగాల్లో రోగులు రద్దీగా ఉండే వార్డుల్లో భద్రత పెంచాలి. కచ్చితంగా సిబ్బందికి తగిన స్థాయిలో రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలి. 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుల భద్రత కోసం తీసుకువచ్చిన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. ఆసుపత్రి ఆవరణల్లో కానీ బయటకానీ తప్పు చేసినవారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి. కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగానే వైద్యులపై దాడి చేసినవారికి ఏడేళ్ల శిక్ష విధించేలా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ఎం.రజనీ దీపా చిట్ల, అమృత హాస్పిటల్, కాకినాడ

పేదలతో ఆట



ఇక నుంచి మూలన పడనున్న ఎండీయూ వాహనాలు


- రేషన్ సరకులకు కత్తెర
- కూటమి ప్రభుత్వంలో కందిపప్పు, పంచదార, గోధుమ పిండి కట్
- అటకెక్కనున్న ఇంటింటికీ రేషన్ ?
- మంగళం పాడేలా సీఎం చంద్రబాబు, మంత్రి నాదెండ్ల తీరు
- చర్చలపై వాహనదారుల ఆవేదన
- ఆందోళనలో 6.50 లక్షల తెలుపుకార్డు కుటుంబాలు
- నిత్యావసర సరకుల్లో కోత వేయడంపై మండిపాటు

కాకినాడ సిటీ: కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. మంచి చేస్తుందని ప్రజలు ఆశించడం సహజం. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలలకే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఆలోచనలను విస్మరించి దాడులను ప్రోత్సహించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో అన్ని వర్గాలవారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ఇప్పటికే అందాల్సిన రైతన్నకు పెట్టుబడి సాయం అందలేదు. తల్లికి వందనం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలకు నిధులు జమ కాలేదు. చేయూత లబ్ధి చాలా మందికి అందని ద్రాక్షగా మారింది. మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి ఊసేలేదు. తాజాగా పేదల జీవనానికి అవసరమైన రేషన్ సరకుల్లోనూ కోత విధించింది. రెండు నెలల్లోనే కందిపప్పు, పంచదార, గోధుమ పిండి ఇవ్వకుండా పేద వర్గాలకు ఆవేదన మిగిల్చింది. మరో వైపు గిరిజన ప్రాంతాలకు ఎండీయూ వాహన సేవలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే ఒరవడి దశలవారీగా మైదాన ప్రాంతాల్లోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు, పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ జరిపిన చర్చల్లో ఎండీయూ వాహనాలను ఇక నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇంటింటికి రేషన్ పంపిణీ మూర్ఖపు నిర్ణయం.. రేషన్ పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) వల్ల తీవ్ర నష్టం కలుగుతోంది, రేషన్ డోర్ డెలివరీపై త్వరలో స్టాక్ హోల్డర్లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి నాదెండ్ల చెప్పడం ఈ వాహనాలతో ఉపాధి పొందుతున్న వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఎండీయూ సిస్టం రద్దు చేసి డీలర్ దగ్గరకే లబ్ధిదారులు వెళ్లే పాత విధానాన్నే అమలు చేస్తారని, ఇక రేషన్ కోసం గంటలు, రోజుల తరబడి డిపోల వద్ద పడిగాపులు కాయాల్సిన రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న ఆవేదన లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. రేషన్ బండి ఇక రాదంటండి అంటూ పల్లెలు, వార్డుల్లో చర్చ సాగుతోంది.

ఒక్కొక్కటిగా నిర్మూలించే ప్రయత్నం

నిరుపేదలకు మేలు చేసే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలను ఒక్కొక్కటీ అటకెక్కించే కుట్రలకు కూటమి ప్రభుత్వం తెరతీసింది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కనుమరుగు చేసే యత్నం జరుగుతోంది. ఇప్పుడు ఇంటింటికీ రేషన్ అందే వాహన సేవలకు మంగళం పాడేందుకు సన్నద్ధమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటింటికి రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను 2021 జనవరి 21న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లాలో 6.50 లక్షల మంది రేషన్ లబ్ధిదారులకు ఇంటి ముందుకే వెళ్లి రేషన్ సరకుల పంపిణీ చేపట్టారు. ఈ క్రమంలో ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీకి ఎండీయూ వాహన నిర్వాహకులతో 2027 సంవత్సరం వరకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. వాహనాల వాయిదాలు సైతం అప్పటి వరకూ చెల్లించాల్సి ఉంది. ఒక్కో ఎండీయూ వాహనం ఖరీదు రూ.5.80 లక్షలు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ వాహనాల కొనుగోలుకు రుణాలు ఇప్పించింది. వాహన వ్యయంతో కేవలం 10 శాతం లబ్ధిదారులు చెల్లించగా మిగిలింది ప్రభుత్వం చెల్లించింది. లబ్ధిదారుడు నెలకు రూ.3 వేలు చెల్లిస్తుండగా మిగిలిన రూ.8 వేలు ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తోంది. పథకాన్ని రద్దు చేస్తే ఈ ఒప్పందం సంగతేమిటని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేయాలనే ఆలోచనతో ఉన్నారు.

మంచి వ్యవస్థను రద్దు చేయొద్దు



గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఎండీయూ వ్యవస్థతో జిల్లాలో 896 మంది నిరుద్యోగులకు ఉపాధి కలిగింది. రేషన్ లబ్ధిదారులకు తూకంలో తేడా లేకుండా ఇంటి వద్దకే వెళ్లి సరకులు అందిస్తున్నాం. ఇంత చక్కటి వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కూటమి ప్రభుత్వానికి తగదు. గిరిజన ప్రాంతాల్లోనూ కొనసాగించాలి. డిపోల్లో సరకులు పంపిణీ చేయడం వల్ల మళ్లీ వ్యయప్రయాసలు తప్పవు. ఎండీయూ వాహన సిబ్బందితో పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడి, వ్యవస్థ గురించి తెలుసుకున్నాక నిర్ణయం తీసుకోవాలి.

– సిద్ధాంతపు రవికుమార్, జిల్లా ఎండీయూ వాహన యజమానులు సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు... ఓటర్ల నమోదు వేగవంతం చేయండి



ఎస్టీయూ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

అమలాపురం టౌన్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా ఓటర్ల కోసం అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన జిల్లా ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా మన హక్కులను పరిరక్షించుకోవచ్చని ఆయన అన్నారు. 2018 నవంబర్ 1 నుంచి 2024 నవంబర్ 1 వరకూ మూడేళ్ల పాటు ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరు నమోదుకు అర్హులని వివరించారు. ఓటరు నమోదుకు సెప్టెంబర్ 3 చివరి తేదీ అని గుర్తు చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు, ఏపీటీయూసీ జిల్లా నాయకుడు కె.సత్తిబాబు పాల్గొన్నారు.

టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలి



టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారని కలెక్టర్ షణ్మోహన్ సగిలి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాకినాడ పిఠాపురం రాజా సర్కిల్ వద్ద ఉన్న అమర జవాన్ పార్కులోని ఆయన విగ్రహానికి కలెక్టర్ అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా నిర్వహించిన సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటం, సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన ధైర్య సాహసాలు అమూల్యమైనవన్నారు. అందుకే ఆయనను ఆంధ్ర కేసరిగా తెలుగు ప్రజలు పిలుచుకుంటారన్నారు. 1953లో నూతనంగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలను, కృషిని భావితరాలకు తెలియజేయాలన్నారు. జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి ఎం.లల్లి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, సెట్రాజ్ మేనేజర్ కె. కాశీవిశ్వేశ్వర రావు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రుణాలు ఇవ్వండి

– బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్



ఆర్బీ 90 క్విజ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, బ్యాంకు అధికారులు

కాకినాడ సిటీ: జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు అవసరమైన రుణాలు బ్యాంకర్లు విరివిగా మంజూరు చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశపు హాలులో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్ సాగుకు రైతులు, కౌలు రైతులు సాగుకు అవసరమైన ఆర్థిక సాయం బ్యాంకర్లు అందజేయాలన్నారు. బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రైతులు సాగుకు అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువులు కొనుగోలు నిమిత్తం రుణాలను మంజూరు చేయాలన్నారు. పశువుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డులు కలిగిన రైతులందరికీ విధిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. 26,916 స్వయం సహాయక సంఘాలకు రుణాలుగా రూ.1729.46 కోట్లు అందించవలసి ఉండగా 2,645 సంఘాలకు రూ.208.30 కోట్లు మాత్రమే ఇచ్చారని, మిగిలిన సంఘాలకు కూడా రుణాలు అందించాలని సూచించారు. జిల్లాలో టిడ్కో గృహాలకు రుణాల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ఆర్‌బీఐ ఎల్‌డీవో పీఎం పూర్ణిమ మాట్లాడుతూ భారతదేశంలో ఏదైనా గుర్తింపు పొందిన కాలేజీ యూనివర్సిటీలు ఎన్‌రోల్ చేసుకున్న 25 సంవత్సరాల వయసున్న అండర్ గ్రాడ్యుయేట్లకు ఆర్బీ 90 పేరుతో నిర్వహించే క్విజ్‌లో పాల్గొనవచ్చన్నారు. మొదటి బహుమతి రూ.10 లక్షలు, రెండో బహుమతి రూ.8 లక్షలు, మూడో బహుమతి రూ.6 లక్షలు అందించనున్నట్టు తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ ఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 23 పబ్లిక్, ప్రైవేట్, ఆర్ఆర్‌బి, కోఆపరేటివ్ బ్యాంక్‌లు ఉన్నాయన్నారు. వీటిని సంబంధించి 327 బ్రాంచ్‌లు ఉన్నాయని, క్రెడిట్ డిపాజిట్ రేషియో 157.70 శాతం ఉందన్నారు. తొలుత 2024–25 ఆర్థిక సంవత్సర జిల్లా వార్షిక రుణ ప్రణాళికను, ఆర్బీ 90 క్విజ్ పోస్టర్లను కలెక్టర్ బ్యాంక్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జేసీ రాహుల్ మీనా, నాబార్డ్ డీడీఎం వై.సోమినాయుడు, యూనియన్ బ్యాంక్ ఆర్ఎం కె.సాయి మనోహర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, హార్టీకల్చర్ అధికారి మల్లికార్జునరావు, మెప్మాపీడీ ప్రియంవద పాల్గొన్నారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

- సత్యదేవుని సన్నిధికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు, నవ దంపతులు
- పెళ్లి బృందాలతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 2,200 వ్రతాల నిర్వహణ, ఆదాయం రూ.40 లక్షలు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు, నవ దంపతులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన నవ దంపతులు, వివాహ బృందాలు, భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు అన్నీ నవదంపతులు, భక్తులతో నిండిపోయాయి. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ముహూర్తాలలో రత్నగిరిపై సుమారు 200 వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో కూడా ఇవే ముహూర్తాలకి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో తమ బంధువులతో కలసి నవదంపతులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం వ్రత మంటపాలు, క్యూ లలో అన్నింటిలో నవ దంపతులు దర్శనమిచ్చారు. వందల సంఖ్యలో నవ దంపతులు సత్యదేవుని వ్రతాలాచరించారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

సుమారు 40 వేల మంది భక్తులు శుక్రవారం స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,200 జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శని, ఆదివారాలలో కూడా కొనసాగనున్న రద్దీ

ఆలయ ప్రాంగణంలోని రామాలయం వద్ద గల విశ్రాంతి మంటపంలో శుక్రవారం రాత్రి 11 గంటల ముహూర్తంలో 50 వివాహాలకు కల్యాణ మంటపాలు సిద్ధం చేశారు. దేవస్థానంలోని పలు మంటపాలలో కూడా వివాహాలు జరుగనున్నాయి. వివాహాలు చేసుకున్న నవదంపతులతో బాటు, ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా శనివారం సత్యదేవుని సన్నిధికి తరలిరానున్నారు. దీంతో రత్నగిరిపై తీవ్ర రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. శనివారం రాత్రి కూడా వివాహాలు జరుగనుండడంతో ఆదివారం కూడా రత్నగిరి పై రద్దీ నెలకొనే అవకాశం ఉంది. పెళ్లిబృందాలకు తోడు భక్తులు కూడా భారీ సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండడంతో శని, ఆదివారాలలో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మంటపాలు, వ్రత మంటపాలు కూడా భక్తులతో కిక్కిరిసే అవకాశం ఉంది. వివాహాల సందర్భంగా సాధారణ భక్తులకు వసతి సత్రాల గదులు లభించే అవకాశం తక్కువగా ఉండే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సాధారణ భక్తులు వసతి గదుల కోసం వత్తిడి తేవద్దని అధికారులు కోరారు.

అవసరాల గుర్తింపునకు గ్రామసభలు

– కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: గ్రామాల అవసరాల గుర్తింపునకు వేదికలా గ్రామసభలు దోహదం చేస్తాయని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన గ్రామ సభలో ఆయన, ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. గ్రామ సభల్లో రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు, తదితర పనులు కోరాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారు పనిచేయడం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం గ్రామ సభలో గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని 16పంచాయతీలలో 2024– 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు గుర్తింపు– ప్రణాళిక కోసం గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు, ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామ సభల్లో గ్రామ మౌలిక సదుపాయాలు, నీటి రక్షణ పనులు, వ్యవసాయ అనుబంధ పనులను ప్రతిపాదించారు. తిమ్మాపురం గ్రామంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఉపాధి హామీ పనులు ప్రతిపాదించగా కూటమి నాయకులు హడావుడి చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే ఫ్లెక్సీల ఏర్పాటు చేయలేదని, తమను స్టేజీపైకి ఆహ్వానించాలని పట్టుబట్టారు. పంచాయతీ కార్యదర్శి ప్రియంకా తమకు ఇచ్చిన ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. తమ్మవరంలో పంట కాల్వల పూడిక తీత సగం సగం ప్రతిపాదించడంతో రైతులు జనసేన నాయకులతో వాగ్వాదానికి దిగారు. పలు గ్రామాలలో కాకినాడలో విలీన ప్రతిపాదిత గ్రామాలను తక్షణం విలీనం చేయాలని కోరారు.



సర్పవరం గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

క్లుప్తంగా

పంట బోదెలో పడి దివ్యాంగుడి మృతి

అల్లవరం: గోడిలంక రైస్‌మిల్లు వద్ద పంట బోదెలో పడి ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన చెక్కా వెర్రియ్య (29) బెండమూర్లంక పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 21న వెర్రియ్య తన భార్య, పిల్లలను ఓడలరేవులోని పుట్టింటికి తీసుకెళ్లాడు. అక్కడ తన బావమరిది భార్య సీమంతం వేడుక చూసుకుని అమలాపురం వెళ్లి వస్తానని భార్యకు చెప్పి తన స్కూటీపై బయలుదేరాడు. గోడిలంక మలుపు వద్ద శివాలయం ఎదురుగా ఉన్న పంట బోదెలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. రాత్రి సమయం కావడంతో ఎవరూ చూడకపోవడంతో వెర్రియ్య చనిపోయాడు. రెండు రోజులుగా అతని ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలో గోడిలంక రైస్‌మిల్లు మలుపు వద్ద పంట కాలువలో శుక్రవారం సాయంత్రం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అతడిని వెర్రియ్యగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడు గతంలో బెండమూర్లంక సెంటర్లో జరిగిన ఓ క్రేన్ ప్రమాదంలో ఎడమ కాలిని కోల్పోయాడు. కృత్రిమ కాలిని అమర్చుకుని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



24/7 రక్షణ ఏర్పాట్లు చేయాలి

సాధారణంగా పీహెచ్‌సీలు జనావాసాలకు దూరంగా ఉంటున్నాయి. నిర్మానుష్యంగా ఉండే పీహెచ్‌సీల్లో మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కోల్‌కతా ఘటన తరువాత విధుల నిర్వహణ భయంగా మారింది. పీహెచ్‌సీల వద్ద 24/7 రక్షణ ఏర్పాట్లు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. వైద్య సిబ్బంది ప్రాధాన్యం, వారి రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలి.

– యామినికావ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, కోటనందూరు





ప్రజల్లో అవగాహన పెంచాలి

కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. రాత్రిళ్లు విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతపై దృష్టి సారించాలి. పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి. అలాగే ఆసుపత్రుల వద్ద నైట్ వాచ్‌మన్‌లను ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలి.

– జగదాంబ, ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్, పెద్దాపురం

మందగించిన కొనుకోళ్లు



- రోజుకు 3.2 లక్షల కిలోల చికెన్ వినియోగం
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సగానికే పరిమితం
- లైవ్ ధర రూ.90, చికెన్ ధర రూ.185
- శ్రావణ మాసం, విష జ్వరాల ప్రభావమే కారణం

అలమూరు: మాంసాహార ప్రియులు చికెన్ ముఖం చూడడం లేదు.. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోళ్లు కనిపించడం లేదు.. ఫలితంగా చికెన్ ధర పాతాళానికి పడిపోయింది. దీంతో కోళ్ల పరిశ్రమ ఒడిదొడుకులను ఎదుర్కొంటూ నష్టాలను చవిచూస్తుంది. ఈ ఏడాది మే నెలలో కిలో బ్రాయిలర్ చికెన్ ధర రూ.350 పలకగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.185కి చేరింది. అదే రూ.167 పలికిన లైవ్ ధర రూ.90కు చేరింది. ప్రస్తుతం ఫారం కోడి లైవ్ కిలో రూ.83, మాంసం రూ.160 పలుకుతోంది. శ్రావణ మాసం ప్రభావంతో పాటు విజృంభిస్తున్న విష జ్వరాలు చికెన్ ధరల తగ్గుదలకు కారణమయ్యాయి. శ్రావణ మాసంలో జరిగే పెళ్లిళ్ల సీజన్‌పై గంపెడాశలు పెట్టుకున్న రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితిని చూస్తుంటే చికెన్ ధర పెరిగే అవకాశం కనిపించడం లేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, మండపేట, సీతానగరం, రాయవరం, అనపర్తి, రాజానగరం, రంగంపేట, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో పౌల్ట్రీ ఉన్నాయి. వీటిలో ఏటా 8 లక్షలకు పైగా కోళ్లు పెంచుతున్నారు. మార్కెట్‌లోకి ప్రతి రోజూ సుమారు 350 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్ల సరఫరా జరుగుతుంది. మూడు జిల్లాల్లో రోజుకు సగటున 3.2 లక్షల కిలోల చికెన్ వినియోగిస్తుండగా, సెలవులు, పర్వదినాల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలు జరుగుతూంటాయి. అయితే ఈ విక్రయాలు సగానికి పడిపోయాయి. బ్యాచ్ వేసిన ఐదు వారాల్లో రెండు కిలోల వరకూ బరువు పెరిగి బ్రాయిలర్ కోళ్లు వినియోగానికి వస్తాయి. పండగలు, జాతరలు, పెళ్లిళ్ల సీజన్‌ను బట్టీ నిర్ణీత సమయానికి అందుబాటులోకి వచ్చే విధంగా రైతులు ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్‌లు వేస్తుంటారు. మిగిలిన నెలలతో పోలిస్తే శ్రావణ మాసం నుంచి కార్తిక మాసం ముగిసే వరకూ చికెన్ వినియోగం తగ్గుతుంది. పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉంటే కొంతమేర అమ్మకాలు ఆశాజనకంగా ఉంటాయి. లేకుంటే నిలకడగా ఉంటుంది. సీజన్ల ఆధారంగా కోళ్ల రైతులు ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ కొత్త బ్యాచ్‌లు వేయడాన్ని కొంతమేర తగ్గిస్తుంటారు.



బ్రాయిలర్ కోళ్లు



లైవ్ చికెన్ ధర తగ్గినా పాత రేట్లతో ఏర్పాటు చేసిన బోర్డు

భారీగా ధర పతనం

ఈ ఏడాది మే నుంచి మూడు నెలల పాటు రికార్డు స్థాయిలో కొనసాగిన బ్రాయిలర్ చికెన్ ధర శ్రావణ మాసం రాగానే పతనమైంది. రెండు వారాల కిందటి వరకూ రిటైల్ మార్కెట్‌లో చికెన్ కిలో రూ.300 నుంచి రూ.350 వరకూ పలికగా, ప్రస్తుతం రూ.185కు చేరింది. శ్రావణ మాసంలో మహిళల పూజలు ఎక్కువగా చేయడంతో పాటు మరోపక్క జ్వరాల బెడద ఎక్కువగా ఉండటం ధరలపై ప్రభావం చూపిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు భయపడి అధిక శాతం మంది మాంసాహారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో చికెన్‌కు డిమాండ్ లేక రోజురోజుకూ ధరలు పతనమవుతూ వస్తున్నాయి. శ్రావణ శుక్రవారం రోజుల్లో చికెన్ ధర లైవ్ రూ.64, స్కిన్‌లెస్ ధర రూ.150 పడిపోవడం గమనార్హం. ధరలు ఆశాజనకంగా ఉంటే కోడి బరువు రెండు కిలోల నుంచి 2.2 కిలోల బరువు వచ్చేసరికి ఫౌల్ట్రీల నుంచి కోళ్లను మార్కెట్‌లోకి తెస్తుంటారు. ప్రస్తుతం పరిస్థితుల్లో అమ్మకాలు లేక మార్కెట్‌లోకి వస్తున్న కోళ్లు రెండున్నర కిలోలకు పైగా బరువుంటున్నాయి. దీంతో బరువు పెరిగిన కోళ్లకు దాణా అధికంగా వినియోగించాల్సి రావడంతో పాటు గతంలో పోలిస్తే అమ్మకాలు సగానికి తగ్గిపోవడంతో నష్టాలు ఎదుర్కొంటున్నామని పౌల్ట్రీ యజమానులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే చికెన్ ధరలు తగ్గినా కొన్ని గ్రామాల్లో పెంచే విక్రయాలు సాగిస్తున్నారు.

గుడ్డు అదే బాటలో..

బహిరంగ మార్కెట్‌లో లేయర్ కోడిగుడ్డు రైతు ధర ఒడిదొడుకులను ఎదుర్కొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు మండలాల్లో సుమారు 320 పౌల్ట్రీలు ఉన్నాయి. 1.5 కోట్ల వరకూ గుడ్లు పెట్టే కోళ్లు ఉండగా, రోజుకు 1.20 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 70 శాతం మేర గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా మిగిలినవి స్థానికంగా వినియోగమవుతున్నాయి. జిల్లా నుంచి ఎగుమతులు జరిగే ఉత్తరాది రాష్ట్రాల్లో మనకంటే రెండు వారాల ముందుగానే శ్రావణ మాసం మొదలవుతుందని పౌల్ట్రీ వర్గాలంటున్నాయి. శ్రావణంలో జిల్లా నుంచి ఎగుమతులకు డిమాండ్ తగ్గి రైతు ధర పతనమవుతుంది. ఈ క్రమంలో జూలై 18వ తేదీకి రూ.5.55గా ఉన్న రైతు ధర క్రమంగా తగ్గుతూ ఆగస్టు రెండో వారం నాటికి రూ.4.26కు చేరింది. కొద్ది రోజులుగా పుంజుకోవడం ప్రారంభమైన గుడ్డు ధర గత సోమవారానికి రూ.5.01కు చేరింది. ఈ ధర మరింత పెరుగుతుందనుకున్న తరుణంలో రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ బుధవారం నాటి నెక్ ప్రకటిత రైతు ధర రూ.4.75కు తగ్గిపోయింది.

మునుపెన్నడూ లేని విధంగా..



బహిరంగ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా చికెన్ ధరలు పతనమవుతుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికే పెరిగిన దాణా ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పౌల్ట్రీ రంగానికి ధరల దోబూచులాట మనోవేదనకు గురిచేస్తుంది. రాబోయే నెలల్లో వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉన్నందున చికెన్ ధరలు పెరుగుతాయని భావిస్తున్నాం.

– బొబ్బా వెంకన్న, పౌల్ట్రీ యజమాని, పెదపళ్ల

గంజాయితో వ్యక్తి అరెస్ట్

తుని: స్థానిక రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం డీఎస్పీ ఎల్.మోహనరావు, సీఐ గౌస్‌బేగ్ ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై నార్త్ ఈస్ట్ ఢిల్లీ అలీగఢ్‌కు చెందిన బ్రాజేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని బ్యాగు తనిఖీ చేశామని అన్నారు. అందులో 6.40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్ట్ చేశామని చెప్పారు. గంజాయి విలువ రూ.31,500 విలువ ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రైల్వే కోర్టులో హాజరు పరిచామన్నారు. మాదక ద్రవ్యాల తరలింపు ముఠాలను పట్టుకోవడానికి జీఆర్పీ, ఆర్‌పీఎఫ్‌తో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి, అన్నవరం, తుని, నర్సీపట్నం రోడ్డు, ఎలమంచిలి రైల్వే స్టేషన్లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్సై అనిల్‌కుమార్, జీఆర్పీ సిబ్బంది సూర్యప్రకాష్, శివసురేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.



గంజాయి, నిందితుడితో జీఆర్పీ పోలీసులు

గంజాయి స్వాధీనం

గోకవరం: గంజాయి తరలిస్తున్న వాహనాన్ని గోకవరం పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాల ప్రకారం.. కృష్ణునిపాలెం పంచాయతీ పరిధి రామన్నపాలెం శివారున ఆగి ఉన్న వ్యాన్‌ను శుక్రవారం పోలీసులు గుర్తించి తనిఖీలు చేశారు. అందులో సుమారు 22 బస్తాల్లో 8 వందల కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ నిర్వహిస్తున్నారు. దీనిపై పోలీసులు ఎటువంటి సమాచారం వెల్లడించలేదు.

ఉరి వేసుకుని కార్మికుడి ఆత్మహత్య

ప్రత్తిపాడు: లంపకలోవ గ్రామంలోని వీరభద్రా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కంపెనీ సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రం కలహంది జిల్లా నర్లా గ్రామానికి చెందిన పపు మంగరాజ్ (26) లంపకలోవ గ్రామ సమీపంలోని వీరభద్రా ఎక్స్‌ఫోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆరు నెలలుగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. అనారోగ్యానికి గురైన కుమారుడిని చూసేందుకు గురువారం బయలుదేరిన అతను తిరిగి వచ్చేసి, కంపెనీ ఇచ్చిన నివాసానికి వెళ్లాడు. ఉదయం కంపెనీ సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఎం.పవన్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. కంపెనీ సూపర్‌వైజర్ పాల్గుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రగతి ఇంజినీరింగ్ విద్యార్థులు, తదితరులు

గండేపల్లి: సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ గురుకులం ప్రైవేట్ లిమిటెడ్ సీటీఓ ప్రమోద్‌కుమార్ కోటగిరి అన్నారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో డెవాప్స్ అండ్ క్లౌడ్ విత్ ఎజ్యూర్ డేటా టూల్స్‌పై రెండు రోజులపాటు జరిగిన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలతో విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవీ రాజేష్, డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



కాలిపోతున్న తాటాకిల్లు

ఏలేశ్వరం: స్థానిక క్వారీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ తాటాకిల్లు కాలిపోయింది. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న దుందుర్తి సూరిబాబు తన కుటుంబ సభ్యులతో నిద్రలో ఉండగా, తెల్లవారు జామున ఒక్కసారిగా తాటాకిల్లుకు మంటలు వ్యాపించాయి. దీంతో వారు భయంతో బయటకు పరుగులు తీశారు. శుభకార్యం నిమిత్తం తీసుకువచ్చిన రూ.50 వేలతో పాటు గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఈ సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

గండ దీపాలతో ఊరేగింపు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో వేంచేసి ఉన్న వేపచెట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గండ దీపాల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయం వద్ద గురువారం రాత్రి మొదలైన ఈ ఊరేగింపు శుక్రవారం తెల్లవారుజాము వరకూ కల్వకొలను వీధిలో సాగింది. వేపచెట్టు వద్దకు చేరుకున్నాక అమ్మవారికి మహా నివేదన సమర్పించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

యానాం: అందరూ చూస్తుండగానే ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నదిలోకి ఓ యువతి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఆ వివరాల్లోకి వెళితే.. యానాం రాజీవ్ రివర్‌బీచ్ వద్ద జీసెస్ స్టాట్యూ దిగువనున్న గోదావరి నదిలోకి తెల్ల చున్నీ వేసుకున్న యువతి (20) నడుచుకుంటూ వెళ్లి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. అటుగా వెళుతున్న స్థానికులు, సీగల్ సిబ్బంది రక్షిద్దామని పరుగున వెళ్లినప్పటికీ అప్పటికే ఆమె గోదావరిలో ఉధృతికి కొట్టుకుపోయింది. దూరం నుంచి ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఆ యువతి గోదావరిలో దిగుతున్న వైనాన్ని వీడియో తీశారు. యువతి ఆత్మహత్యా యత్నంపై యానాం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఆ యువతి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని మేకల మృతి



నల్లజర్ల: మండలంలోని దుప్పిగుంట (పార్వతిపురం) వద్ద శుక్రవారం ఉదయం మేకలు మేత కోసం వెళ్లి తిరిగి చీకటిపడే వేళ ఇంటికి వెళుతున్న క్రమంలో ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో 14 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. అదే ప్రాంతానికి చెందిన యంత్రపాటి చంద్రయ్యకు 24 మేకలు ఉన్నాయి. వాటిని సమీప పొలాల్లో మేపడానికి తీసుకెళ్లి తిరిగి వచ్చే క్రమంలో రోడ్డు దాటితే చంద్రయ్య ఇల్లు వస్తోంది. రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోగా కొయ్యలగూడెం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న వ్యాన్ చీకట్లో ఈ మేకలను ఢీకొంది. చనిపోయిన మేకల విలువ రూ.3 లక్షల వరకూ ఉంటుందని అంచనా.